క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమపాలనకు ఆకర్షితులై మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన వందమంది ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. బీసీ కాలనీకి చెందిన బోయ ఉమేష్ , తిప్పయ్య, మరితిప్పయ్య, హనుమంతు, రుద్రయ్య, సిద్దయ్య, చిన్న తిప్పయ్య, తిప్పేస్వామి, రామంజి, శివణ్ణ తదితర 18 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులను విప్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, బోర్ వెల్ నాగిరెడ్డి, మెచ్చిరి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బండి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



మస్తాన్ భార్య, తండ్రికి రూ.70వేలు అందజేస్తున్న ఫర్టిలైజర్‌షాపు అసోషియేషన్

కణేకల్లు: కణేకల్లు ప్రాంతంలో ఓ పెస్టిసైడ్ కంపెనీలో రెప్‌గా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన మస్తాన్, కణేకల్లుకు చెందిన అరుణ్ కుటుంబాలకు ఫర్టిలైజర్‌షాపు అసోషియేషన్‌తోపాటు వారి మిత్రులు బాసటగా నిలిచారు. మస్తాన్ భార్య కాష్మీ, తండ్రి ఇస్మాయల్‌కు ఫర్టిలైజర్‌షాపు అసోషియేషన్ అధ్యక్షుడు ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్‌గుప్తా, కోశాధికారి చాంద్‌బాషా, ఉపాధ్యక్షులు తుకారం, సహాయ కోశాధికారి సురేష్‌రెడ్డి అసోషియేషన్ తరపున రూ.70వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. అలాగే అరుణ్ కుటుంబానికి రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో హుసేన్, చంద్ర, లక్ష్మీనారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా అంభోజీరావు



రాయదుర్గంటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ సిటిజన్స్ రాయదుర్గం శాఖ నూతన అధ్యక్షుడిగా వాడేకర్ అంభోజీరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం లయన్స్ క్లబ్ సభ్యులు సమావేశమై అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా పేర్మి సత్యనారాయణలను ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున నుంచి నూతన అధ్యక్షుడిగా అంభోజీరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు రేకులకుంట సత్యనారాయణ, నాగరాజు, రవికుమార్, శ్రీనివాసులు, వెంకటరమేష్, ఉమామహేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్థల సమస్యకు పరిష్కారం



దివ్యాంగులతో జేసీ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ విజయకుమారి

కళ్యాణదుర్గం: ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా మూడన్నరేళ్ల సమస్య మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ గౌతమి చొరవతో తీరింది. గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుందుర్పి కుసుమగిరి వికలాంగుల మండల సమాఖ్య సభ్యులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జేసీ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, కుందుర్పి తహసీల్దార్ విజయకుమారి చర్చలు జరిపారు. కుందుర్పిలోని సర్వే నంబర్ 226లో వికలాంగుల సమాఖ్యకు 2018లో ప్రభుత్వం 10 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. అయితే గ్రామానికి చెందిన కొందరు ఆ స్థలంలో ఐదు సెంట్లు తమకు వస్తుందంటూ పనులు చేపట్టేందుకు యత్నించారు. అప్పటి నుండి దివ్యాంగులు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకునేది. సమస్యను దివ్యాంగులు వరుసగా అధికారులకు విన్నవించారు. స్పందించిన అధికారులు ఆర్డీఓ కార్యాలయంలో మరోసారి దివ్యాంగులతో ఈ విషయమై చర్చించారు. ఆ 10 సెంట్లను కుసుమగిరి వికలాంగుల మండల సమాఖ్యకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వికలాంగుల సంఘం నాయకులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు వెంకటేష్, మర్రిస్వామి, లక్ష్మి, గోవిందు, వసంత్, రాజేష్, చిన్నమల్లప్ప, ఉద్దీప్‌సింహాల, అన్ని మండలాల దివ్యాంగులు పాల్గొన్నారు.

రైతు మోమున చిరునవ్వులు

- మూడు నియోజకవర్గాల్లో రూ.102 కోట్ల నిధులు విడుదల
- 1,10,507 మంది రైతులకు లబ్ధి
- రేపు కళ్యాణదుర్గంలో బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్న సీఎం జగన్
- అన్నదాతల హర్షం



బీమా సొమ్మును సింహభాగం కైవసం చేసుకున్న పత్తిపంట



కళ్యాణదుర్గంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన 50 పడకల ఆసుపత్రి భవనం

రాయదుర్గం/కళ్యాణదుర్గం: ఖరీఫ్ 2022లో వివిధ రకాల పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ–క్రాప్ ఆధారితంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ బీమా సొమ్ముతో ధీమానిచ్చారు. గతేడాది అత్యధికంగా పత్తి పంట తెగుళ్లబారిన పడి అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీనికి తోడు ప్రకృతి ప్రకోప పరిస్థితులు వెంటాడటంతో పెట్టుబడులు సైతం నెత్తినొచ్చాయి. ఈ కారణంగా రైతన్నలు అప్పులమూట కట్టుకోవాల్సి వచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీమా జాబితాలో తెల్ల బంగారం పంట పండింది. ప్రభుత్వం ఎకరాకు రూ.15,948 బీమా ప్రకటించింది. అలాగే వేరుశనగకు ఎకరాకు రూ.2,900లు, టమాటకు రూ.600 ప్రకారం నష్ట పరిహారం విడుదల చేస్తూ అర్హులైన రైతుల పేర్లను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో ప్రదర్శించారు.

రూ.102 కోట్ల బీమా సొమ్ము విడుదల

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 1,10,507 మంది రైతులకు రూ.102.076 కోట్ల నగదును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని శనివారం కళ్యాణదుర్గం రైతుసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతు ఖాతాల్లోకి జమ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.20 లక్షల మంది రైతులకు రూ.1,117.21 కోట్ల నగదు జమకు కళ్యాణదుర్గం సభ వేదిక కానుంది. దీంతో ఈ ప్రాంత రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు అశాస్త్రీయ పద్ధతిలో పంటల బీమా అందిస్తుండడంతో అయినవారికే పరిహారం అందేది. ప్రస్తుత ఆ విధానాలకు స్వస్తీచెప్పి ఈ–క్రాప్ అమలుతో పూర్తి పారదర్శకతకే సీఎం జగన్ పెద్దపీత వేశారు. ఈ కారణంగా పార్టీలకు అతీతంగా రైతన్నలకు న్యాయం చేకూరింది.

నాలుగేళ్లలో కళ్యాదుర్గానికి రూ.4,260 కోట్ల నిధులు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఏ మారుమూల పల్లెకు వెళ్లి...ఏ గడప తలుపు తట్టినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల మాటే వినిపిస్తుంది. ఏ ఒక్కరిని కదిలించినా మా ఇంట్లో అమ్మ ఒడి వచ్చింది...మా ఇంట్లో పింఛను వస్తోంది...మా ఇంట్లో రైతు భరోసా....వసతి దీవెన వస్తుందంటూ సంతోషంగా సమాధానమిస్తున్నారు. 2019 జూన్ నుంచి 2023 మే వరకూ కళ్యాణదుర్గంలో సంక్షేమ పథకాల ద్వారా 8,87,989 మంది లబ్ధిదారులకు రూ.3051.84 కోట్లు విడుదలైంది. అదేవిధంగా వివిధ పథకాల ద్వారా 55,973 అభివృద్ధి పనులకు గానూ రూ.1209.37 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం అంతా ఎలాంటి దళారీల వ్యవస్థ లేకుండా నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాకే జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సీఎంకు రుణపడి ఉంటాం



2022 లో 3.21 ఎకరాల్లో పత్తి, 5.43 ఎకరాల్లో వేరుశనగ సాగు చేపట్టాను. వివిధ కారణాలు వెరసి పత్తి పంటలో తీవ్రంగా నష్టపోయాను. అప్పులు తెచ్చిన వారికి తిరిగి ఎలా చెల్లించాలో దిక్కుతోచని పరిస్థితి. ఇంతలోనే సీఎం జగన్ విడుదల చేసిన బీమా సొమ్ము ఊపిరి పోసింది. పత్తికి రూ.51,193, వేరుశెనగకు రూ. 15,747 మొత్తం రూ.66,940 జమైంది. ఆపద కాలంలో ఆదుకున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. – వాల్మీకి ఓబన్న, రైతు, రంగచేడు

టీడీపీ నాయకులది నీతిమాలిన చర్య



అధికారంలో ఉన్ననాళ్లు రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసి దోపిడినే అజెండా మార్చుకున్న పచ్చద్రోహులు రైతుల పట్ల ఈ రోజు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉంది. బాబు హయాంలోని బీమా బకాయిలు కూడా మా ప్రభుత్వంలో చెల్లించే దుస్థితి పట్టింది. రైతు సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారు. టీడీపీ నాయకులకు సైతం రూ.లక్షల్లో భీమా డబ్బులు చేర్చిన ఘనత జగనన్నకే దక్కింది. – కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

బీటీపీ త్వరలో పూర్తి చేస్తాం



నియోజకవర్గ ప్రజలు ఎంత నమ్మకంతో నన్ను ఆదరించారో అంతే నమ్మకంగా ఏడాదిలోపు మరింత అభివృద్ధి చేస్తాను. నాలుగేళ్లలో రూ.4 వేల కోట్లు సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేశామంటే అతిశయోక్తి కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాబోవు రోజుల్లో బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేసి నా కలను సాకారం చేసుకుంటాను. నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరందిస్తా. కళ్యాణదుర్గం పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. సంక్షేమాన్ని ఓర్వలేకే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. – కేవీ ఉషశ్రీచరణ్, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి

పేదలకు అండగా 'వైఎస్సార్ బీమా'

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు అండగా ఉంటోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. 3వ సచివాలయం పరిధిలో 5వ వార్డులో బుధవారం రాత్రి అనారోగ్యంతో రహీమా బీ(38) మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలు బాధిత కుటుంబ సభ్యులకు గురువారం చైర్‌పర్సన్‌తోపాటు కౌన్సిలర్, వైస్ చైర్మన్ వలిబాషా అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివపుత్ర, దేవరాజు, మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు శ్రీరామిరెడ్డి, పొరాళ్ల శివకుమార్, గోనబావి నిజాముద్దీన్, కృష్ణమూర్తి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సరిత, అమెనిటీస్ రాజు, వలంటీరు మన్సూర్ పాల్గొన్నారు.

దాణాకు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: పశు వైద్యశాలలో సంపూర్ణ సమీకృత దాణా(టీఎంఆర్)కు డీడీలు తీసి దరఖాస్తులు చేసుకోవాలని పశు వైద్యాధికారి ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన స్థానిక పశువైద్యశాలలో రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. అలాగే టన్ను సమీకృత దాణాకు రూ.6,500 చెల్లించాలని, ఒక్కో రైతుకు రెండు టన్నులు పంపిణీ చేస్తామన్నారు. 25 టన్నుల వరకూ రైతులు డీడీలు చెల్లిస్తే నాలుగు రోజుల్లో గ్రామాల్లోకే దాణా అందజేస్తామన్నారు. అలాగే గడ్డి విత్తనాలు సైతం పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని కిలో రూ.22తో ఒక్కో రైతుకు 20 కిలోలు అందజేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండండి

ఉరవకొండ: పెంపుడు జంతువులు జోనోసిస్ సంక్రమిత వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్ సూచించారు. గురువారం ఉరవకొండ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జోనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు.

నేడు 'జగనన్న సురక్ష'

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి, దుద్దేకుంట సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



మెచ్చిరిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కరకముక్కలలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాయదుర్గం రూరల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మెచ్చిరి గ్రామంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, సర్పంచ్ ఊలెమ్మతో కలసి గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడంమే కాకుండా పార్టీలు, కులమతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. గత ఐదేళ్ల పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జన్మభూమి కమిటీ సభ్యులు పేదలకు పథకాలు అందించకుండా పందికొక్కుల్లా మెక్కారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్‌పై పప్పు నాయుడు (లోకేష్) నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే తుప్పు(చంద్రబాబు) నాయుడు పిచ్చికుక్కల్లా పొంతన లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుక, మట్టి, నీరు చెట్టులో కోట్లకు కోట్లు దోచుకున్న మురికి కాలవ నాపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బోర్‌వెల్ నాగిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సురేష్, బండి శ్రీకాంత్, దొణప్పరెడ్డి, మల్లాపురం శివారెడ్డి, చదం తిప్పేస్వామి, పంచాయితీ కార్యదర్శి హేమంత్ రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

ఉరవకొండ(విడపనకల్లు): ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం విడపనకల్లు మండలంలోని కరకముక్కల గ్రామంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి పొందారో ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయ రెడ్డి, నాయకులు వడ్డే వెంకటేష్, ఆదిమల్లు, ధనంజయరెడ్డి, పాలాక్షిరెడ్డి, రామన్న, తిప్పేస్వామి, పుషోత్తం, గణేష్, మండల జేసీఎస్ కన్వీనర్ భరత్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలని వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం



రాయదుర్గం రూరల్: పల్లేపల్లిలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు



వజ్రకరూరు: గడేహోతురులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాయదుర్గం రూరల్/కణేకల్లు/బొమ్మనహాళ్/గుమ్మఘట్ట/వజ్రకరూరు/కూడేరు/ శెట్టూరు/ బ్రహ్మసముద్రం/ కంబదూరు/ కుందుర్పి : 'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం చేస్తామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాయదుర్గం మండలంలోని వేపరాల గ్రామంలో సర్పంచ్ నసీమాబేగం అధ్యక్షతన గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత బాబు జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జగనన్న సురక్షలో 135 మందికి 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. విప్ మాట్లాడుతూ దివంగత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రాం ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనను సాగిస్తున్నారని పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో ఏ ప్రభుత్వ పథకమైనా అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే వచ్చేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హతే ఆధారంగా పార్టీలు, కులమతాలకతీతంగా పథకాలు అందించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. అలాగే పల్లేపల్లి గ్రామంలో సర్పంచ్ రాధమ్మ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషా, సచివాలయాల మండల కన్వీనర్ గొల్ల మురహరి, మాజీ ఎంపీపీ నాగరాజరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రేకులకుంట శివారెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, కెంచానపల్లి బుజ్జి, రాఘవేంద్ర గౌడ్, నాగేంద్ర, వెంకటస్వామి, కరివీరప్ప, మాజీ సర్పంచ్ శంకర్ , మారెన్న, సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండన్న, డీటీ సురేష్ బాబు, ఏఓ చిక్కణ్ణ, పంచాయతీ కార్యదర్శులు శ్రీదేవి, హేమంత్ రాజు, గృహసారథులు, వలంటీర్లు , పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కణేకల్లు మండంలోని ఎన్.హనుమాపురంలో, బొమ్మనహాళ్ మండల కేంద్రంలో, గుమ్మఘట్ట మండలంలోని బేలోడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వజ్రకరూరు మండలంలోని గడేహోతురులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కమలపాడు వెంకటరెడ్డి, సర్పంచు కె.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూడేరు, శెట్టూరు మండలంలోని బచ్చేహళ్లి, బ్రహ్మసముద్రం మండలలోని కన్నేపల్లి, కంబదూరు మండలంలోని తిమ్మాపురం , కుందుర్పి మండలంలోని మలయనూరు, కరిగానిపల్లి పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ గ్యారేజ్ తనిఖీ



గ్యారేజ్‌లో పనులను పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్‌ను ఆ సంస్థ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల తనిఖీ చేశారు. గురువారం ఆమె గ్యారేజ్‌తో పాటు డిపోను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ నెల 8న రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గానికి రానున్న నేపథ్యంలో గ్రామాలకు వెళ్లే బస్సులను సక్రమంగా నిర్దేశించిన సమయానికి పంపాలని డిపో మేనేజర్ రామచంద్రకు సూచించారు. అసిస్టెంట్ ఇంజనీర్ మాధవి, ట్రాఫిక్ సూపర్‌వైజర్ మారెన్న, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్నోబిలంలో వేలం వాయిదా

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాలు, టెంకాయలు, కొబ్బరి చిప్పలు, పాత్ర సామాన్లు బాడుగకు ఇవ్వడానికి ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వేలం నిర్వహించారు. అయితే గత సంవత్సరం కంటే తక్కువగా ధర పలకడంతో దేవదాయశాఖ అధికారుల ఆదేశాలతో వేలం వాయిదా వేశారు. అలాగే కలగలుపు బియ్యం, బేడలను కిలో రూ.20 ప్రకారం కోనాపురం గ్రామానికి చెందిన సి. రాము వేలంలో దక్కించుకున్నాడు.

బాధ్యతల స్వీకరణ

కూడేరు: బదిలీపై మండలానికి వచ్చిన ఏడుగురు సచివాలయ ఉద్యోగులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పేరు సచివాలయ సర్వేయర్‌గా ప్రత్యూష(రామగిరి మండలం నుంచి), కొర్రకోడు సచివాలయ మహిళా పోలీస్‌గా చంద్ర సునీత(బెళుగుప్ప) కూడేరు–1 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా శ్రీనివాసులు రెడ్డి, మరుట్ల సచివాలయ సర్వేయర్‌గా హరినాథ్‌రెడ్డి(శింగనమల), ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా బాబా ఫక్రుద్దీన్(ఆత్మకూరు) , ఉదిరిపికొండ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా కావేరి మానస (లేపాక్షి), పి.నారాయణపురం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా శ్రావణ్ కుమార్ (ధర్మవరం నుంచి) బదిలీపై వచ్చారు.

సీఎం సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాయదుర్గం రూరల్: రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న కళ్యాణదుర్గం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని పల్లేపల్లిలో మాజీ ఎంపీపీ గౌని నాగరాజరెడ్డి స్వగృహంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డితో కలిసి గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గంలో భారీ బహిరంగ రైతు సభను ఏర్పాటు చేశారన్నారు. ఈ బహిరంగ సభలో 2022 ఖరీఫ్ కు సంబంధించిన వైఎస్సార్ పంటలబీమా కింద రైతులకు రూ.1,016 కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లాకు రూ.211.80 కోట్లు, రాయదుర్గం నియోజకవర్గానికి రూ.36.25 కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. కావున పార్టీ శ్రేణులు ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, రేకులకుంట శివారెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ఈనెల 8న కళ్యాణదుర్గంలో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సీఎం పర్యటన విజయవంతంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి, వైఎస్సార్ రైతు దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గంలోని కంబదూరు రోడ్డులో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ సీనియర్లకు సభకు తరలించే బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఉపసర్పంచ్ వన్నప్ప, నాయకులు అశోక్, బసవరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: కళ్యాణదుర్గంలో ఈ నెల 8న నిర్వహించే సీఎం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌డ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, కెనిగుంట రామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

వజ్రకరూరు: మండలంలోని గంజికుంట గ్రామానికి చెందిన దాసరి గోపీనాథ్ అనే విక లాంగుడికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో ట్రైసైకిల్ మంజూరైంది. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో దివ్యాంగుడు తనకు ట్రై సైకిల్ మంజూరు చేయాలని మాజీ ఎ మ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే విభిన్న ప్రతిభావంతుల ఏడీ రసూల్ దృష్టికి తీసుకువెళ్లడంతో ట్రైసైకిల్ మంజూరు చేశారు. గురువారం విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో జరుగుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో దివ్యాంగుడికి మాజీ ఎమ్మెల్యే ట్రైసైకిల్‌ను అందజేశారు.

డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయండి

కణేకల్లు:కణేకల్లులో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఆధ్వర్యంలో గురువారం ఇంటర్ విద్యార్థులు రాస్తారోకో, ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి, వీరేంద్రప్రసాద్, జిల్లా కోశాధికారి బండారు శంకర్ మాట్లాడుతూ కణేకల్లులో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని, అంత దూరం వెళ్లలేక అనేక మంది ఇంటర్‌కే మానేస్తున్నారన్నారు.